చేయూత.. నిశ్చింత

- నిరుపేద మహిళలకు ఏడాదికి ఒకరికి రూ.18,750
- 3 విడతల్లో మండలంలో 3,661 మందికి రూ.20.59 కోట్లు అందజేత
- నేడు నాలుగో విడత సొమ్ము జమ, 4,171 మందికి లబ్ధి



కొనుగోలు చేసిన పాడి గేదెలతో తలారి లక్ష్మీదేవి

తుగ్గలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుపేద మహిళలకు తోబొట్టువులా అండగా నిలిచారు. వారిని పేదరికం నుంచి విముక్తుల్ని చేసేందుకు 'వైఎస్సార్ చేయూత' పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వం అందించిన చేయూతతో మహిళలు వివిధ వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా రాణిస్తున్నారు. ఇప్పటివరకు వైఎస్సార్ చేయూత పథకం కింద మండలంలో 3661 మందికి మూడు విడతల్లో రూ.20.59 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేశారు.

45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలు పేదరికం నుంచి బయటపడి స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఇందుకోసం 'వైఎస్సార్ చేయూత' పథకాన్ని ప్రారంభించారు. గతేడాది అగ్రవర్ణ పేద మహిళలకు వైఎస్సార్ చేయూత నందించారు. పేదరికంలో మగ్గిపోతున్న వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం ఇస్తున్న చేయూత సత్ఫలితాలనిస్తోంది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లకు రూ.75 వేలు, అగ్రవర్ణ పేదలకు ఏటా రూ.15 వేల చొప్పున మూడేళ్ల పాటు రూ.45 వేలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఇప్పటికే మూడు విడతల్లో సొమ్ము జమ చేశారు. ఈ ఏడాది మండలంలో 4,171 మందికి లబ్ధి చేకూరుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాకు నిధులు జమ చేయనున్నారు. చేయూత పథకం ద్వారా ఆర్థికాభివృద్ధికి సహాయ పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

జగనన్న చేసిన మేలును మరువం



వైఎస్ జగనన్న సీఎం అయ్యాక పేదలకు ఎంతో మేలు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం 45 ఏళ్లు నిండిన మహిళలకు చేయూత పథకం కింద ఆర్థికసాయం అందిస్తున్నారు. నాకు మూడు సార్లు రూ.56,250 వచ్చాయి. ఆ సొమ్ముతో మొదట నాలుగు పొట్టేళ్లు కొన్నా. తర్వాత మరో రెండు పొట్టేళ్లు కొన్నా. వాటి ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు ఉపయోగపడుతోంది. ఇచ్చిన మాట ప్రకారం చేయూత పథకం అమలు చేసి సాయం అందిస్తున్న జగనన్న మేలును మరువలేం. ఆయనకు రుణపడి ఉంటాం. – హనుమంతమ్మ, రాతన

అప్పుల నుంచి గట్టెక్కుతున్నాం

మాకు మూడెకరాల పొలం ఉంది. వానలు బాగా పడితే కాస్త పంట పండుతుంది. ఇద్దరు, కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. ఉన్న కొద్దిపాటి పొలంలో పంటలు సరిగా రాక, కుటుంబ పోషణ, పిల్లల పెళ్లిళ్లు చేయడంతో అప్పులు అయ్యాయి. వాటిని తీర్చేందుకు చాలా కష్టాలు పడుతున్నాం. ఇలాంటి సమయంలో వైఎస్ జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక చెప్పిన మాట ప్రకారం పొదుపు గ్రూపులో ఉన్న నాకు ఆసరా పథకం కింద ఏటా రూ.10,300 చొప్పున రూ.41,200 రుణమాఫీ సొమ్ము జమ చేశారు. వైఎస్సార్ చేయూత కింద రూ.18,750 చొప్పున మూడుసార్లు రూ.56,250 వచ్చింది. ఈ సొమ్ముతో రెండు పాడి గేదేలు కొన్నా. రోజూ పది లీటర్లకు పైగా పాలు అమ్ముతున్నా. వచ్చిన ఆదాయంతో మెల్లిమెల్లిగా అప్పులు తీర్చుకుంటున్నాం. జగనన్న మేలును ఎప్పటికీ మరువలేం. – తలారి లక్ష్మీదేవి, రామాపురం

జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి

ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల ద్వారా మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నాం. సంక్షేమ పథకాల సొమ్ముతో మహిళలు, దుకాణాలు, పాడి గేదెలు, పొట్టేళ్ల పెంపకం ఇతర వ్యాపారాలతో అదనపు ఆదాయం పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. గురువారం నాలుగో విడత చేయూత నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి మహిళల ఖాతాల్లో జమ చేయనున్నారు. – రాధాకృష్ణ, వైకేపీ ఏపీఎం

క్లుప్తంగా

చౌకదుకాణాలపై దాడులు



స్టాకు వివరాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

దేవనకొండ: మండలంలోని చౌక దుకాణాలు–16, 17లలో బుధవారం మధ్యాహ్నం విజిలెన్స్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో బియ్యం, చక్కెర, రాగిపిండి, రాగులు రిజిస్టర్‌లో నమోదుచేసిన స్టాక్ కంటే ఎక్కువగా ఉండడంతో చౌకదుకాణాల డీలర్లపై 6ఏ క్రిమినల్ కేసులు నమోదు చేసి షాపును సీజ్ చేసినట్లు విజిలెన్స్ సీఐ రామకృష్ణ, ఆర్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చౌకదుకాణాల్లో నిత్యావసర సరుకులు నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విజిలెన్స్ అధికారులు, సివిల్ ఆఫీసర్ రూపస్‌రోనాల్డ్, సివిల్ సప్లై సిబ్బంది శివప్రసాద్ ఉన్నారు.

రూ.5.70 కోట్లతో మద్దికెర - బురుజుల రోడ్డు



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి

మద్దికెర: మండలంలో రూ.5.70 కోట్లతో మద్దికెర – బురుజుల తారు రోడ్డు పనులకు బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించినట్లు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. రోడ్డు అధ్వానంగా ఉండడంతో సమస్యను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేయడంతో పనులు మొదలుపెట్టామన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ సలహాదారు బండారు ఆంజనేయులు, మండలకన్వీనర్ గంపల వెంకటేశులు, శ్రీనివాసులు, కృష్ణ, రామకృష్ణ, రామాంజులు ఉన్నారు.

12న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్లు గ్రామంలో హిమాం ఖాసీం స్వామి ఉరుసు పురష్కరించుకుని ఈ నెల 12న రాష్ట్రస్థాయి బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ సర్పంచ్ తెలుగు వాణిశ్రీ, ఎంపీటీసీ బేతాపల్లె రాజేశ్వరి బుధవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి దాతల సహకారంతో వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల జట్లు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 77023 57609, 83090 15932 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యుత్ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ ఉమాపతి

మద్దికెర: విద్యుత్ సమస్యలపై సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆ శాఖ ఆపరేషన్ ఎస్ఈ ఉమాపతి హెచ్చరించారు. ఆయన బుధవారం మద్దికెరలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పగటి పూట వీధి దీపాలను ఆర్పివేయాలని, ఇందుకోసం ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, మల్లికార్జున, నాగేశ్వరరెడ్డి, గంపల వెంకటేశులు తదితరులు గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, అలాగే ఎం.అగ్రహారం గ్రామం బీసీ కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. వీటినంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏఈ రఫీక్ అహమ్మద్ ఉన్నారు.

తప్పిన ప్రమాదం

హొళగుంద: స్థానిక పెద్ద చెరువు సమీపంలో చెత్త నుంచి ఎరువుల తయారీ కేంద్రం వద్ద చెత్త దిబ్బలకు బుధవారం మంటలు అంటుకోగా అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. కేంద్రం పక్కనే పదుల సంఖ్యలో రైతులకు చెందిన గడ్డి వాములు ఉన్నారు. బుధవారం చెత్త దిబ్బలకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. సమాచారం ఆలూరు ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు పక్కనున్న గడ్డివాములకు వ్యాపించకుండా అదుపుచేశారు. దీంతో గడ్డివాముల యజమానులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సమష్టి కృషితో మండల అభివృద్ధి

చిప్పగిరి: సమష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ జూటూరు హేమలత అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ ఆదేశించారు. ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ నారాయణ, వైస్ ఎంపీపీ నరసింహులు, ఎంపీటీసీలు సుంకన్న, భీమలింగ, సర్పంచులు బీమ, పురుషోత్తం, ఎంపీడీఓ బరెన్‌సాహెబ్, తహసీల్దార్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

10న బండలాగుడు పోటీలు

ఆస్పరి: మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని మండలంలోని బిణిగేరి గ్రామంలో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా ఈనెల 10వ తేదీన రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వృషభాల యజమానులు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 81794 69377, 95730 12831 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

చిప్పగిరి: మండలంలోని 29 పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ పద్మజ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్ బూత్‌లలో శుభ్రత, సౌకర్యాల కల్పనలో లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ బరెన్ సాహెబ్, ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడండి



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి

ఎమ్మిగనూరురూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం ఉన్నతాధికారులకు అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. తహసీల్దార్లు శేషారెడ్డి, ఓబులేసు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎన్నికల డీటీ గురురాజారావు తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా



తెర్నెకల్‌లో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సర్పంచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో దాదాపు 250 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకుని మందులను తీసుకున్నారు. బీపీ, షుగర్, డయాబెటీస్, కంటి పరీక్షలు, రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీటీసీ నామాల శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు రాముడు, సునీతలు, డాక్టర్ అతావుల్లా, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తుగ్గలి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలైన వైద్య సేవలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్ అన్నారు. బుధవారం జీ.ఎర్రగుడిలో నిర్వహించిన వైద్య శిబిరంలో పగిడిరాయి పీహెచ్‌సీ డాక్టర్ మినాజ్‌పాషా, స్పెషలిస్టు వైద్యుడు వెంకటయ్య, ఆప్తాలిక్ అసిస్టెంట్ ఖలీల్ ఓపీ ద్వారా 280 మందికి వైద్య సేవలందించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతన్నలకు పంట నష్టపరిహారం



రామళ్లకోట ఆర్బీకేలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని లైవ్‌లో తిలకిస్తున్న రైతులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో గత ఖరీఫ్‌లో 18706 మంది రైతులు కంది, పత్తి, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న, కొర్ర, సజ్జ, ప్రొద్దుతిరుగుడు, ఉద్యాన పంటలు పచ్చిమిర్చి, ఉల్లి, టమాటా తదితర పంటలు సాగుచేసి వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోవడంతో ప్రభుత్వం రూ.15.36 కోట్ల పరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమచేసినట్లు ఏఓ అక్బర్‌బాషా తెలిపారు. ఈ మేరకు బుధవారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి డీబీటీ ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేశారు. ఈ సదర్భంగా సీఎం ప్రసంగాన్ని వెల్దుర్తి ఆర్బీకేలో టీవీ ద్వారా లైవ్‌లో ఏఓ అక్బర్‌బాషా, సర్పంచ్ నిర్మల, వీఏఏ సాంబశివుడు ఆధ్వర్యంలో రైతులు వీక్షించారు. రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎంగా ఉండడం తమ అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు.

మద్దికెర: మండలంలో ఖరీఫ్–2023 సీజన్‌కు సంబంధించి 5775 హెక్టార్ల పంటలకుగాను 6826 మంది రైతులకు రూ.7 కోట్లు నష్టపరిహారం మంజూరైనట్లు ఏఓ రవి తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో సీఎం వైఎస్ జగన్ ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.

కృష్ణగిరి: ఖరీఫ్–2023 సీజన్‌కు సంబంధించి వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమైనట్లు పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. టి.గోకులపాడు రైతు భరోసా కేంద్రంలో వారు రైతులతో కలిసి సీఎం ప్రసంగాన్ని తిలకించారు. మండలంలో 19,697 మంది రైతుల ఖాతాలకు రూ.21,56,60,785 జమ కావడం జరిగిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు సీజన్ ముగిసేలోపే పరిహారం అందించడంతో సీఎం జగన్నకు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

హొళగుంద: మండలంలోని 24 గ్రామాలలో 8,657.38 హెక్టార్లలో వివిధ పంటలు సాగుచేసి నష్టపోయిన 8,819 మంది రైతులకు ప్రభుత్వం రూ.14,67,08,805 పరిహారం మంజూరుచేసింది. పత్తి, మిరప, వేరుశనగ పంటలకు హెక్టారుకు రూ.17 వేలు, మిగతా పంటలకు రూ.8,500 చొప్పున పరిహారం అందిస్తున్నట్లు ఏఓ ఆనంద్ లోకదళ్ తెలిపారు.

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం



నిధుల వినియోగంపై చర్చిస్తున్న సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ పాలక వర్గంలో బీసీ, మైనారిటీలకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అధిక ప్రాధాన్యతనిచ్చారని వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పేర్కొన్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులతో పాటు టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ల పదవుల్లో మైనారిటీలు ఇతర బీసీ కులాలకు అందలమెక్కించిన ఘనత ఎమ్మెల్యేదే అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలోని 62 అంశాలలో 4వ, 62వ అంశాలను వాయిదా వేసి మిగిలిన అంశాలతో పాటు, టేబుల్ అజెండాను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు వైస్ చైర్మన్ ప్రకటించడంతో సభ్యులు సమ్మతించారు. మున్సిపల్ సాధారణ నిధులను మొత్తం వినియోగిస్తూ, 15వ ఆర్థిక సంవత్సర నిధుల్లో కేవలం రూ.3 కోట్లు మాత్రమే వినియోగించినా కాంట్రాక్టర్లకు బిల్లులు రాక పనులు జరగలేదని, సాధారణ నిధులు ఏమయ్యాయని విపక్ష కౌన్సిలర్ దయాసాగర్ ప్రశ్నించగా, వైస్ చైర్మన్ ధీటుగా బదులిచ్చారు. కమిషనర్ గంగిరెడ్డి, డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, ఆర్ఓ బేబి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఈఓఆర్డీ

మద్దికెర: గ్రామాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, పంచాయతీ సలహాదారు బండారు ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో కొంతమంది పంచాయతీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కూలివేస్తామన్నారు. అలాగే పంచాయతీ స్థలాలను ఆక్రమించుకొని వ్యాపారాలు చేసుకోవడమే గాకుండా బాడుగకు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డుకు అడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే తొలగిస్తామన్నారు. సభ్యులు పంచాయతీ ఆదాయం పెరిగేందుకు తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఉపసర్పంచ్ ప్రమీలమ్మ, సభ్యులు కిట్టి, బాలు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ.. మద్దతు కోరుతూ



వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మిగనూరు సమన్వయకర్త బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: చేనేతపురి ఎమ్మిగనూరు పట్టణంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఉదయం సోగనూరు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో భర్త నీలకంఠ, కుమారుడు ప్రత్యుల్, పార్టీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, 6వ వార్డు కౌన్సిలర్ ఎంకే శివప్రసాద్ తదితరులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 6వ వార్డులో ఇంటింటికీ వెళ్లి మహిళలు, వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకొంటూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌నే ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. చేనేత కార్మికులను కలిసి ఓ ఇంట్లో మగ్గం నేశారు. నేతన్న నేస్తం పథకం గురించి వివరించారు. వార్డులోని కొందరు విద్యార్థులను కలిసి బడికి సరిగా వెళుతున్నారా? స్కూళ్లు ఎలా ఉన్నాయని అడగ్గా బడిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, తమ తల్లుల ఖాతాలో అమ్మ ఒడి నగదు జమ అవుతుందని వారు తెలిపారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మక జగనన్నకే మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. వార్డు పరిధిలో కొన్ని సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా పరిరిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు అమాన్, ఇషాక్, రాజారత్నం, సుధాకర్, షాబుద్దీన్, కోటకోండ నరసింహులు, చంద్రశేఖర్, సూరి, ఇలియాజ్, సయ్యద్ చాంద్, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

హొళగుంద: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు, అల్లర్లు సృష్టించి ప్రశాంతతకు భంగం కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆయన బుధవారం రాత్రి హొళగుంద ఎస్ఐ పెద్దయ్యనాయుడుతో కలిసి ఎల్లార్తిలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, సమస్యాత్మక గ్రామమైన ఎల్లార్తిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నేర చరిత్ర కలిగిన వారి కదలికలపై నిఘా ఉంచామన్నారు. ఓటర్లను భయపెట్టడం, ప్రలోభాలకు గురి చేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మార్లమడికి వద్ద ఉన్న సెబ్ చెక్‌పోస్టును పరిశీలించి కర్ణాటక నుంచి అక్రమ మద్యం, డబ్బు రవాణా జరగకుండా గస్తీ పటిష్టం చేయాలని సిబ్బందికి సూచించారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. ఆయన బుధవారం ఆలూరులోని సచివాలయం-3 పరిధిలో రోగులకు వైద్య సేవలందించారు. 90 మంది వృద్ధులు, గర్భిణులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎం యశోద, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

హొళగుంద: నా అనే వాళ్లు లేక అనాథలై ఒంటరి జీవనం సాగిస్తున్న మార్లమడికి, హొళగుంద గ్రామాలకు చెందిన వృద్ధులు, దివ్యాంగులకు బుధవారం ఆదోని వివేకానంద సేవా సంస్థ, భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.స్వచ్ఛందసంస్థ సభ్యులు మూర్తి, ప్రకాష్, సిద్ధార్థ గౌడ్ ఆధ్వర్యంలో బియ్యం, కందిబ్యాళ్లు, వంటనూనె, చక్కెర ఇతర సరుకులను అందజేశారు.

బ్రహ్మగుండంలో ఏర్పాట్ల పరిశీలన

వెల్దుర్తి(కృష్ణగిరి): బ్రహ్మగుండం క్షేత్రంలో ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం వెల్దుర్తి సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ సీసీ కెమెరాల పనితీరు మెరుగుపరచాలని చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, ఆలయ సిబ్బందికి సూచించారు.జాగరణ, కల్యాణం, రథోత్సవం, బండలాగుడు పోటీలకు హాజరయ్యే భక్తులు, ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలు, పార్కింగ్ వివరాలపై చర్చించి తగు సూచనలు చేశారు. ఆలయ సిబ్బంది మద్దిలేటి, నాయకులు రఘురెడ్డి, ఎల్లయ్య ఉన్నారు. ఉత్సవాల్లో విద్యుత్ అసౌకర్యం కలగకుండా వెల్దుర్తి ఏఈ రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యలను డోన్ ఈఈ ప్రసాద్ రెడ్డి పరిశీలించారు. 200 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా ఉత్సవాలకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. సిబ్బంది లోపాలను సరిదిద్దుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు

పత్తికొండ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పత్తికొండ అర్బన్ సీఐ మురళీమోహన్ సూచించారు. మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలోని ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మైత్రి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్మోహన్ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి



పెద్దహోతూరులో ప్రజలకు నమస్కరిస్తున్న విరూపాక్షి

ఆలూరు రూరల్: జగనన్న ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే జనం మద్దతు ఉందని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పెద్దహోతూరు, హులేబీడు గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై అతికొద్ది మందికే సంక్షేమ పథకాలు అందేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి ప్రలోభాలకు గురిచేసే టీడీపీ నాయకుల మాటల నమ్మవద్దన్నారు. అనంతరం హులేబీడులో హీరామోహినుద్దీన్ ఉరుసు సందర్భంగా దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఈరన్న, ఎంపీటీసీ దేవరాజు, చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య, నాయకులు వీరేష్, మోదీన్ తదితరులు ఉన్నారు.

దేవనకొండ: మండలంలోని కొత్తపేట, కూకటికొండ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, నాయకులతో సమన్వయకర్త బి.విరూపాక్షి సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు తెలియజేసి మరోసారి సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, కొత్తపేట సర్పంచ్ బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి చేసిన మేలును వివరిద్దాం



మాచాపురంలో సిద్ధం పోస్టర్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమ కోసం ప్రవేశపెట్టిన పథకాలను, చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించి పార్టీ గెలుపునకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని మాచాపురం, ఇబ్రహీంపురం గ్రామాలలో కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. బూత్ స్థాయిలో కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించాలన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు కోటీశ్వరరావు, మోహన్, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: మండల పరిధిలోని జీఎర్రగుడి, పెండేకల్లు, మారెళ్లలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, జెడ్పీటీసీ పులికొండనాయక్, సింగిల్‌విండో అధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ పెద్ద రంగన్న, మారెళ్ల సుధాకరరెడ్డి, సచివాలయ, బూత్ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేసే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. నాయకులు అట్ల బసిరెడ్డి, దేవేంద్రారెడ్డి, వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే శిలాఫలకాల ధ్వంసం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మద్దికెర: మండల కేంద్రంలో గత 50 ఏళ్లలో జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ పాలనలో నాలుగేళ్లలోనే జరిగిందని, అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు దుండగులు శిలాఫలకాలను ధ్వంసం చేయడం దురదృష్టకరమని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, శ్రీనివాసులు, మండల కన్వీనర్ గంపల వెంకటేశులు అన్నారు. వారు బుధవారం మాట్లాడుతూ.. మద్దికెర నుంచి బొజ్జనాయునిపేట వరకు రూ.2.50 కోట్లతో తారు రోడ్డు వేశామని, అలాగే మద్దికెరలో రూ.55 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేత ప్రారంభించి శిలాఫలకాలు ఆవిష్కరించినట్లు చెప్పారు. దీన్ని ఓర్వలేని కొందరు శిలాఫలకాలు ధ్వంసం చేయడం తగదన్నారు. పచ్చని గ్రామాల్లో చిచ్చు పెట్టాలని కొందరు కుట్రలు చేస్తున్నారని, అలాంటివారు తీరుమార్చుకోకపోతే చట్టం ప్రకారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎంపీటీసీ గద్దల ఆంజనేయులు, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, నాయకులు కృష్ణ, రామాంజులు, రామకృష్ణ, రోశప్ప, ఉద్దండ రాయుడు, వుశేని ఉన్నారు.

శివస్వాముల ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు

హొళగుంద: స్థానిక ఈరన్న బావి వద్ద వెలసిన సోమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివస్వాముల ఆధ్వర్యంలో సామూహిక వివాహాల కార్యక్రమం నిర్వహించారు. రెండు జంటలు వివాహం చేసుకోగా వధూవరుల కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు గ్రామపెద్దలు హాజరై దంపతులను ఆశీర్వదించారు. అందరికీ అన్నదానం చేశారు. అంతకుముందు కార్యక్రమ నిర్వహణకు వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి తరపున నాయకులు రూ.10 వేలు విరాళం అందించారు.